కథానిక

# గతి తప్పిన నర్మద

—ఎస్. నిర్మలాకృష్ణమూర్తి

పాప నిదురపోసాగింది. ఆకాశములో నీలిమబ్బుల మేఘాలు చంద్రుడిని కమ్మివేస్తున్నాయి. పాప మనస్సు ఆచల్లని సమయంలో ఎన్నిలోకాలు దాటిపోయి ఉయ్యాలలో చేరుతుందో చెప్పలేము. మెల్లగా చేతిలోని ఉయ్యాల జారిపోయింది, ఐదారుసార్లు అటు ఇటు పచార్లు చేసి తన గమ్యస్థానంలో నిల్చిపోయింది. గోడమీద గడియారం టంగ్ టంగ్ మని తొమ్మిది కొట్టింది. ఇంకా ఇంటి గుమ్మం చేరలేదు క్రిష్ణారావు. ఎంతసేపని చూడను? చాలా విసుగు అనిపించింది నర్మదకు. పాపము ఏమీ పాలుపోలేదు, గడియారం పదిచూపింది.

"నర్మదా! నర్మదా!" అని తలుపు చప్పుడు చేశాడు క్రిష్ణారావు. నర్మద హాలులో లైటు వెలిగించి ద్వారము తెరచింది.. ఆయన రావటమే తడవు చెప్పులు మూలకు చేరుకున్నాయి. తిన్నగా పర్సుప్యాంటుకు తగిలించాడు. గబగబా బాత్ రూము ప్రవేశించి నర్మదా వేడినీళ్లు పెట్టావా అని అడిగాడు. నర్మదకు పైప్రాణాలు పైకేపోయాయి. ఏమీ జవాబు చెప్పలేక మరచిపోయానండి అన్నది నర్మద.

నీవు ఎక్కడ వున్నావు. ఈ ప్రపంచములో లేవు. పదింటికి బయటకు వెళ్ళినవాడిని ఆసంగతి ఏమీ నీకు పూర్తిగా కొట్టబడం లేదు. అమ్మగారికి అరికాళ్లు నడినెత్తికి వస్తున్నాయి. గబగబా అనవలసిన మాటలు ఏమేమో అనేశాడు క్రిష్ణారావు. ఎందుకు ఈరోజు ఇలా కోపంగా ఉన్నారు అనుకొన్న నర్మద ప్యాంటుకివున్న పర్సు జేబులో చెయ్యివేసి తీసింది ఒక కవరు. అది ఎవరు వ్రాశారా అని ఆత్రుతతో చూసింది. సుబ్రహ్మణ్యం వ్రాశాడు.

క్రిష్ణారావు భోజనానికి కూర్చున్నాడు. వడ్డించివచ్చి నర్మద ఉత్తరం ముగించి యథాస్థానంలో పెట్టింది. నర్మద గుండె అతివేగంతో బీర్వావైపు ప్రసురింపజేసింది. కాని ఏమిలాభం? ఇవ్వవలసిన సొమ్ము ఎలాగైనా యివ్వవలసిందే!

క్రిష్ణారావు భోజనం ముగించి ఆత్రుతతో ప్రక్కమీద వాలాడు. నర్మదకు భోజనం సహించలేదు. ఉండే సామానంతా పనిమనిషికిపడేసి వంటగదిసర్ది కడిగి తలుపులు గడియపెట్టింది. పాపమీద చేయివేసుకు పడుకుంది.

ఎన్ని రోజులకు తీరుతుందో ఈ డబ్బు, అబ్బ! మంచి బెడద నా నెత్తిమీదకు పడింది అనుకున్నాడు. పాపము చెల్లెలికి అప్పుచేసి పెండ్లి చేశాడు. ఆ అప్పు ఇంతవరకు తీరలేదు. బుర్ర పిచ్చిపిచ్చి ఆలోచనలలో తిప్పివేస్తుంది. పోనీ నర్మద మెడలోని సొమ్ములయినావున్నాయా? తగినంత సొమ్ము లేదు.

తెల్లవారినర్మద నిత్యకృత్యాలు తీర్చుకొనటానికిలేచింది.

"అమ్మా. అమ్మా" అనిపిలిచింది పనిమనిషి లక్ష్మి. నర్మద వాకిలి తెరచింది. లక్ష్మి బోయిలర్ లో నిప్పువేసి గదులు అంతా చిమ్మి, ఉండే అంట్లుతోమి ఇచ్చివెళ్ళింది. వేడివేడినా కాఫీ, ఉప్మా చేసింది నర్మద. క్రిష్ణారావు చిరాకుగాలేచి స్నానంచేసి టిఫెనుకు రెడీ అయ్యాడు. తీయని కలలుకని నిద్రాదేవిని తప్పించుకొని కూనిరాగాలతో నిద్రలేచింది పాప. నర్మద పాపాయిని తీసుకొని టిఫెను వడ్డించింది. క్రిష్ణారావు కొంచెమునేపు పేపరు చదివి ఆఫీసుమొగం పట్టాడు.

క్రిష్ణారావు పోస్టాఫీసులో ఒక క్లర్కుగా వున్నాడు. అతనికి వచ్చేజీతం నూరు లోపుగా వస్తుంది. చూడటానికి బోలెడు ఖర్చులు. క్రిష్ణారావుకు నెలబత్యం నెలకే సరిపోతుంది. అందులో మదరాసులో జీవనం చెయ్యటం చాలా కష్టము. ఇంటిబాడుగ యివ్వాలి. పాలవాడికి, చాకలివాడికి, పనిమనిషికి, పైన ఇతర ఖర్చులు యిన్ని చూసుకోవాలి. అందులో మొన్నమొన్నే ఇన్స్యూరెన్సు బుక్ ఓపెన్ చేశాడు!

నర్మద ఒక గిన్నెలో అన్నం నెయ్యికలిపి పాపకి తినిపిచ్చింది.

అమ్మగోరూ, అమ్మగోరూ, మొదటితేదీ వచ్చింది. ఇంక చేతిలో జీతం పడెయ్యరా అమ్మా అని అడిగింది లక్ష్మి. అయ్యగారు వచ్చాక తీసిపెడ్తాను అన్నది నర్మద. గోడ గడియారం పదిగంటలు కొట్టింది. పోస్టువాడు కవరు తెచ్చి యిచ్చాడు. గబా గబా ఆకవరు చింపి చదివింది.

క్రిష్ణారావుకు,

మీ తండ్రి ఆశీర్వచనములుచేసి వ్రాయు ఉత్తరము మీ అమ్మగారు, నీచెల్లెలు మద్రాసు చూడటానికి బయలుదేరి వస్తున్నారు. మద్రాసుకు 9 గంటలకు బొంబాయి మెయిల్‌లో వస్తారు. నీవు స్టేషను దగ్గర వాండ్లను కలుసుకోవలసినది.

ఇట్లు మీ తండ్రి,
ఈశ్వరయ్య.

నర్మద ఉత్తరం ముగించి సెల్ఫుమీద పెట్టింది. లక్ష్మి పనులుఅన్ని ముగించుకొని అయ్యగారికి టిఫెను క్యారియరులో భోజనం తీసికెళ్ళింది.

అబ్బ! ఆడజన్మ ఎత్తేదానికన్నా అడవిలో మానై పుట్టేది మేలు అనుకుంది. ఇన్ని ఖర్చులు ఆయన యెలా భరిస్తారో అనిపించింది. నర్మదకు పాపము తనుచుటుకు ఏమి చేయగలదు. అలా ఇలా సాయంత్రము అయింది. క్రిష్ణారావు వచ్చాడు. తిన్నగా షర్టు స్టాండుకు తగించి కాళ్ళు కడుక్కొని టిఫెను తిన్నాడు. నర్మద ఉత్తరం తెచ్చి క్రిష్ణారావు చేతిలో పెట్టింది. అతను ఆ వుత్తరం చదవడంతోడనే గుండె నీరయిపోయింది. మెదడుకు ఏమీ సమాధానము చెప్పలేకలేక తొమ్మిదికి స్టేషనుకు వెళ్ళాడు.

అప్పుడు ఆ బొంబాయి మెయిల్ నిప్పులు కక్కుతూ వచ్చింది. పాపము క్రిష్ణారావు ప్లాట్‌ఫారం మీద అటూ ఇటూ చూస్తూ ఆత్రుతతో కాలుజారి పడిపోయాడు. డ్రైవరు స్టేషను దగ్గరకు వచ్చిందిగదా అని ఆవేశంతో వెనక్కి తిరిగి చూస్తూవున్నాడు. ఈ సంఘటన జరిగిన మరుక్షణం రైలు చుట్టు జనం మూగిపోయారు. క్రిష్ణారావుని జనరల్ హాస్పిటల్‌లో చేర్చారు. దేహం అంతా కట్లుకట్టారు.

ఆ వచ్చే రైలులో బంధువులు రాలేదు! వచ్చే నెలలో వస్తారని టెలిగ్రాం ఇంటికి వచ్చింది. నర్మద టెలిగ్రాంనిచూసి సెల్ఫుమీదపెట్టి ఇవతలకు వచ్చింది. ఎవరో నలుగురు మగవారు వచ్చారు. ఆయన రైలుక్రిందపడ్డారు. మీరు త్వరగా రావలసిందని చెప్పారు. నర్మద హాస్పిటల్ వెళ్ళింది. క్రిష్ణారావును చూచినతోడనే మూర్ఛపోయింది. పాపము.

నర్మదకు ఈ ప్రపంచములో ఎవరూ లేరు. తన భర్త తనకు ఆధారం. అమ్మ నాన్న చిన్నప్పుడే దూరం అయ్యారు. తన ఒక బీదింటిపిల్ల. చిన్నప్పటినుంచి బాబాయి పెంచి పెద్దచేసి చదివించాడు. అప్పుడు తన అందాన్నిచూసి క్రిష్ణారావు తనను తప్ప ఇంకెవ్వరినీ పెండ్లి చేసుకోను అనటంవల్ల తల్లిదండ్రులు ఉండే ఒక్కకొడుకు మాటను కాదనలేక పెండ్లిచేశారు. పెండ్లి అయిన రెండవ సంవత్సరం పాపాయి పుట్టింది. పాపము క్రిష్ణారావు ఎంత ఇష్టపడి పెండ్లి చేసుకున్నాడో అన్నికష్టాలు పడ్తున్నాడు. నర్మదకు మెలుకువ వచ్చింది. కంటికి మింటికి ఏకధారగా ఏడువసాగింది.

డాక్టరువచ్చి క్రిష్ణారావునుచూచి ఇంక ఏమీ లాభం లేదనిచెప్పి వెళ్ళిపోయాడు. వెంటనే క్రిష్ణారావు తల్లిదండ్రులకు టెలిగ్రాం యిచ్చారు. వాండ్లు వచ్చి కర్మకాండాలన్ని ముగించి ఎవరిదారిన వాండ్లు వెళ్ళిపోయారు. పాపము నర్మదకు ఇప్పుడు ఎవ్వరూ దిక్కులేరు! పాపతప్ప.

మొన్నటిరోజు క్రిష్ణారావు ఆఫీసులో యిచ్చిన జీతం అలాగే వుంది. ఇవ్వవలసిన వాండ్లకు అప్పులుతీర్చి మిగిలిన డబ్బుతో సంసారాన్ని చేస్తూవుంది. జరిగినవన్ని జ్ఞప్తికివచ్చి నర్మద మనస్సు పాడుచేస్తూ ఉంటాయి. పాపనుచూసి గుండె రాయిచేసుకొంది నర్మద.

మరుసటి రోజు గరల్స్ హైస్కూలులో టీచర్సు కావాలని పేపరులో వచ్చింది. నర్మద సంతోషంతో అప్లికేషను రాసింది. వెంటనే నెలాఖరులోగా పనిలో చేరమని ఆర్డరు యిచ్చారు. నర్మద సంతోషానికి ఒకప్రక్క విషాదపు నీడలు. జీవితంలో ఉండవలసిన అదృష్టం లేదుకదా అని చాలా దుఃఖించింది.

నర్మద పనిలో చేరింది. రోజులు దొర్లిపోతున్నాయి. నర్మద ఎవ్వరిమీద ఆధారపడలేదు. తన జీవితం తను గడుపుకుంటూ వుంది. ఆనాడు తను చదివిన చదువు! ఈనాడు ఈ కష్టాలలో ఆచదువు వినియోగించింది. ఎప్పటికైనా ఆడదానికి చేతిలో ఏదైన ఆధారంవుండి పెండ్లి చెసుకోవాలి అనుకున్నది నర్మద. నడిసముద్రంలో తెరచాప తెగిన నావలా దిక్కుతెలియక తికమకపడి ఏం ప్రయోజనం? ధైర్యంగా ఒడ్డుకు చేరేలా చూసుకోనే నేర్పుండాలి అనుకుంది నర్మద.